## క్లుప్తంగా

### ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ

కాకినాడ రూరల్: ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని సీనియర్ న్యాయవాది డాక్టర్ వై.వసంత అన్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద ఆదికవి నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో గురువారం ప్రపంచ న్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ పనితీరుపై న్యాయవాది వసంత అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థపై నమ్మకంతో సమాజంలో సమానత్వాన్ని స్థాపించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నానిబాబు, మధుబాబు, స్టీఫెన్, హారిక, గోపి, హరిబాబు, నదీమ్, మనోజ్‌దేవా తదితరులు పాల్గొన్నారు.

### పోక్సో ప్రత్యేక కోర్టు పీపీగా శ్రీదేవి


పెంకే శ్రీదేవి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్స్ యాక్టు (పోక్సో) ప్రత్యేక కోర్టుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది పెంకే శ్రీదేవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో చిన్నారులపై జరిగిన లైంగిక దాడుల కేసులను ప్రభుత్వం తరఫున వాదించడానికి శ్రీదేవిని నియమించారు. కాకినాడ బార్ అసోసియేషన్‌లో 24 ఏళ్లుగా ఆమె న్యాయవాది వృత్తిలో పని చేస్తున్నారు. పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన శ్రీదేవిని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరు సుబ్రహ్మణ్యం, సీహెచ్ చంటి అభినందించారు.

### పారిశుధ్య పనుల తనిఖీ


పెద్దాపురప్పాడులో అవగాహన కల్పిస్తున్న జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు

కరప: పెద్దాపురప్పాడు గ్రామంలో గురువారం జిల్లా పరిషత్ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు పర్యటించారు. పారిశుధ్య పనుల నిర్వహణను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త ఎలా సేకరిస్తున్నదీ ఆయన ఆరా తీశారు. తాగునీటి క్లోరినేషన్‌ను తనిఖీ చేసి, క్లోరినేషన్ చేసిన తర్వాతే తాగునీరు సరఫరా చేయాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించి, దాని పనితీరును సమీక్షించి, పంచాయతీ సిబ్బందికి సూచనలిచ్చారు. తర్వాత జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు గ్రామ మహిళలను కలసి ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌కు గడువు పొడిగింపు

కాకినాడ సిటీ: వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ను 2025–26 ఆర్థిక సంవత్సరానికి పొడిగించారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంగళవారం జీవో జారీ చేసినట్లు సమాచార పౌరసంబంధాల శాఖ, కాకినాడ జిల్లా ఉప సంచాలకుడు డి.నాగార్జున గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 31వ తేదీ వరకూ అక్రిడిటేషన్లు అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులంతా రూ.1,250 (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎఫ్ఎంఎస్.ఏపీ.జీవోవీ.ఇన్) వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలని వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తులను కాకినాడ రామారావుపేటలోని సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని అన్నారు.

### కాకినాడకు జాతీయ స్థాయిలో 38వ ర్యాంక్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో కాకినాడ 38 ర్యాంకుతో బెస్ట్‌గా నిలిచింది. ఏటా కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా వివిధ ప్రమాణాల మేరకు వీటిని ప్రకటిస్తుంది. జనాభా ప్రాతిపదికన సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డుల కేటగిరీలో భాగంగా 3 లక్షల నుంచి 10 లక్షల లోపు కేటగిరీలో కాకినాడ నగర పాలక సంస్థ ఎంపికైంది. 2024–25 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో జాతీయ స్థాయిలో 38వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్‌తో మెరిసింది. గతంలో 2023–24 స్వచ్ఛ సర్వేక్షన్‌లో జాతీయస్థాయిలో 178వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంక్‌తో పోలిస్తే ఈ ఏడాది చాలా మెరుగైన ర్యాంకు సాధించింది. మున్సిపల్ కార్పొరేషన్ కనబరిచిన ప్రతిభకు కార్పొరేషన్ అధికారులు, పారిశుధ్య కార్మికులు, పౌరులకు కలెక్టర్ సణ్మోహన్ సగిలి అభినందనలు తెలిపారు. ఈ ర్యాంకులు ప్రజల సమష్టి కృషి ద్వారా వచ్చాయని కమిషనర్ భావన పేర్కొన్నారు.

# పన్ను ఎగ్గొట్టారు!

- గ్రామాల్లో అక్రమ నిర్మాణాలు
- ఆదాయం కోసం రీ సర్వే
- తిమ్మాపురంలో అనధికార భవనాల గుర్తింపు

కాకినాడ రూరల్: పంచాయతీల అభివృద్ధికి ఆదాయ వనరులే ముఖ్యం.. ఇది ప్రధానంగా ఆస్తి పన్నుల ద్వారానే సమకూరుతోంది.. నివాస, వ్యాపార స్థలాలతో పాటు విద్యా సంస్థలు, పరిశ్రమల ద్వారా పన్నుల రూపేణా ఆదాయం వస్తుంది. కొందరు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆ ఆదాయానికి గండి పడుతోంది. కాకినాడ రూరల్‌లో మొత్తం 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి ఆస్తి పన్నుల రూపేణా ఏటా సుమారు రూ.9 కోట్ల వరకూ ఆదాయం వస్తుంది. మండలంలోని రమణయ్యపేట, తూరంగి, ఇంద్రపాలెం, వాకలపూడి, వలసపాకల, తిమ్మాపురం, సూర్యారావుపేట తదితర గ్రామాల్లో వాణిజ్య, పారిశ్రామిక, విద్యా సముదాయాలు ఉన్నాయి. వీటి ద్వారా ఆయా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరాల్సి ఉంది. తాజాగా అధికారులు గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్ను రీ వెరిఫికేషన్ చేపడుతున్నారు. గతంలో విధించిన పన్నుల్లో కొలతల్లో తేడాలు గుర్తిస్తే రీ అసెస్‌మెంట్ ద్వారా ఆస్తి పన్నును సరిచేసి పంచాయతీలకు ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టారు. తొలుత 10 వేల చదరపు అడుగుల పైబడిన ఆస్తులను గుర్తిస్తున్నారు.

**కాకినాడ రూరల్‌లో అటువంటివి 59 వరకూ ఉండగా, ప్రస్తుతం రీ సర్వే ద్వారా కొలతల్లో తేడాలు గుర్తిస్తే మరో రూ.కోటి ఆదాయం పెరుగుతుందని అంచనా. ఇంతవరకూ బాగున్నా, కొన్ని సంస్థలు** తమ రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని పన్నుల నుంచి తప్పించుకుంటున్నాయి. తిమ్మాపురం గ్రామంలో ఏడీబీ రోడ్డును ఆనుకుని పంట పొలాల్లో ఓ విద్యా సంస్థ ఉంది. సుమారు 3.7 ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్న ఈ విద్యా సంస్థలో తొలుత ఒక భవనానికి మాత్రమే అధికారికంగా జీ ప్లస్ టూ పంచాయతీ నుంచి అనుమతి తీసుకుంది. స్థలంతో పాటు ఆ భవనం వరకూ సుమారు రూ.1.5 లక్షల పన్ను చెల్లిస్తుంది. తరువాత 2004లో మూడు, నాలుగు అంతస్తుల కోసం సదరు విద్యా సంస్థ పంచాయతీకి అర్జీ పెట్టుకోవడంతో గ్రామ పంచాయతీ తీర్మానం ద్వారా రాజమహేంద్రవరంలోని టౌన్ ప్లానింగ్ ఆర్జేడీకి సాంకేతిక అభిప్రాయం తీర్మానించి పంపారు. విద్యా సంస్థ మాత్రం అనుమతులతో పని లేకుండా మరో రెండు అంతస్తులు అదనంగా నిర్మించింది. పన్ను మాత్రం చెల్లించడం లేదని అధికారులు అంటున్నారు. దీంతో పాటు కొత్తగా జీ ప్లస్ భవనం, టెన్నిస్ కోర్టులను అనుమతులు లేకుండా నిర్మించిందని చెబుతున్నారు. భవన నిర్మాణం కోసం ప్లాన్ అప్రూవల్ తీసుకోవడంతో పాటు బెటర్‌మెంట్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అది చెల్లించకన పోవడంతో పంచాయతీ ఆదాయం కోల్పోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా నియోజవర్గంలో ఇంకా ఇలాంటి భవనాలు ఉంటే రీ సర్వేలో గుర్తించి పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చే చూడాలని ప్రజలు కోరుతున్నారు.


తిమ్మాపురంలోని ఓ విద్యా సంస్థలో నిర్మాణాల కొలతలు వేస్తున్న అధికారులు

**అనుమతి లేని నిర్మాణాలు తొలగించాలి**



గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా తమ పంచాయతీలో విద్యా సంస్థలో చేపట్టిన నిర్మాణాలు తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామ పంచాయతీని మోసం చేసి పన్ను ఎగవేసింది. కొత్తగా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టింది. దీనిపై న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తాం.

–బెజవాడ వీరవెంకట సత్యనారాయణ, సర్పంచ్, తిమ్మాపురం

**అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇస్తాం**



గ్రామ పంచాయతీ ఆదాయం పెంచేందుకు తొలుత 10 వేల చదరపు అడుగులు దాటి వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, విద్యా సంస్థల్లో రీ సర్వే ద్వారా కొలతలు చేపడుతున్నాం. తిమ్మాపురంలో రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్ సంస్థలో కొలతలు వేశాం. అనుమతులు లేని నిర్మాణాలు గుర్తించాం. నోటీసులు జారీ చేస్తున్నాం. భవనాలు కూడా పరిధిలోకి వస్తున్నాయి. వారికి పంపుతున్నాం. పన్ను విధిస్తే దాదాపు మూడు రెట్లు పెరుగుతుంది. అనుమతులు లేని నిర్మాణాల సంగతి తేలే వరకూ పన్ను విధించం.

–రామాంజనేయులు, ఈఓపీఆర్‌డీ, కాకినాడ రూరల్

## నేడు శాకంబరిగా బాలాత్రిపుర సుందరి


కూరగాయలను దండలుగా గుచ్చుతున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం శాకంబరిగా దర్శనమివ్వనున్నారు. సుమారు 6 టన్నుల కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో గర్భాలయంతోపాటు ఆలయ పరిసరాలు సర్వాంగ సుందరంగా అలంకరించనున్నట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. భక్తులు సమర్పించిన ఆకుకూరలను దండలుగా గుచ్చి అలంకరిస్తామన్నారు. ఆలయ భక్త సమాజం ఆధ్వర్యంలో కూరగాయాలను దండలుగా గుచ్చినట్లు చెప్పారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

### ఉపాధి పనులపై నేడు సమీక్ష

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై 18వ విడత సామాజిక తనిఖీ జరుగుతుందని ఎంపీడీఓ ఎం.అనుపమ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చినెలాఖరు వరకు రూ.13.27 కోట్ల విలువచేసే 1222 పనులు జరిగాయన్నారు. ఇందులో ఉపాధి పనులతో పాటు, పంచాయతీరాజ్, సమగ్ర శిక్ష అభియాన్‌కు సంబంధించిన పనులు జరిగాయి. ఉపాధి వేతనాలుగా రూ 8.33 కోట్లు, మెటీరియల్‌కు రూ 4.94 కోట్లు ఖర్చు చేశారు. వీటితోపాటు పింఛన్ల పంపిణీపై డీఆర్పీలు ఈ నెల 2 నుంచి 17వ తేదీ వరకూ తనిఖీచేసి, నివేదికలు ఇచ్చారని, దానిపై బహిరంగ సమీక్ష జరుపుతారన్నారు. ఆయా శాఖల అధికారులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, తప్పనిసరిగా పాల్గొనాలని ఎంపీడీఓ తెలిపారు.

### మౌలిక వసతులు కల్పించండి

నాగమల్లితోట జంక్షన్: కాకినాడ పార్లమెంట్ పరిధిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'ఖేలో ఇండియా' కింద మౌలిక వసతులు కల్పించాలని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులను కలిశారు. కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను ప్రత్యేకంగా కలసి కాకినాడ పార్లమెంట్ పరిధిలో క్రీడల అభివృద్ధిపై చర్చించారు.

# చెలరేగిపోతున్న మట్టి మాఫియా

- పొలాల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- వివిధ ప్రాంతాలకు తరలింపు

కరప: మట్టి మాఫియా చెలరేగిపోతోంది.. ఎవరూ పట్టించుకోక వారు ఆడిందే ఆటగా మారింది.. మట్టిని రేయింబవళ్లు ట్రాక్టర్లతో తరలిస్తూ అందినకాడకు దోచుకున్నారు. ట్రాక్టర్ల మోతతో పగలు ట్రాఫిక్ స్తంభించిపోతుంటే, రాత్రుళ్లు కంటిమీద కునుకు ఉండటం లేదని ప్రజలు వాపోతున్నారు. పాఠశాలలకు వెళ్లే, వదిలిన సమయాల్లో అతివేగంగా తిరుగుతుండటంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆవేదన చెందున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతోనే కరప, పేపకాయలపాలెం గ్రామాల్లో మట్టి మాఫియా ఆగడాలు మితిమీరిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. భూముల మెరక పేరుతో రైతుల నుంచి ఉచితంగా మట్టిని తీసుకుని, ట్రాక్టర్ ట్రిక్ మట్టిని రూ.900 నుంచి రూ.1,200కు అమ్మేసుకుంటున్నారు. జేసీబీ, ట్రాక్టర్ల అద్దె వంటి ఖర్చులు పోను ట్రిప్‌నకు రూ.600 నుంచి రూ.800 వెనకేసుకుంటున్నారు. జూలైలో వర్షాలు పడి, దమ్ములు చేసి, వరినాట్లు వేయాల్సిన కాలం. వేసవిని మించిన ఎండలు కాస్తుండటంతో సొమ్ము కూడబెట్టుకోవడానికి మట్టి మాఫియాకు అధిక మాసం లభించింది. ఓ పార్టీ నాయకుడు అయితే బరితెగించి మరీ 30 ట్రాక్టర్లు, నాలుగైదు జేసీబీలతో రాత్రింబవళ్లు మట్టిని తవ్వేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు ఎవరైనా వెళ్లి అనుమతులు తీసుకున్నారా అని అడిగితే ఇక్కడ ఉద్యోగం చేయాలని లేదా అని బెదిరింపులకు పాల్పడుతున్నాడని అంటున్నారు. సాధారణంగా రైతు చేలో మెరక తీసుకోవడానికి రెవెన్యూ కార్యాలయంలో అనుమతి తీసుకుని, ఆ మట్టిని ఇంటి పునాదులకు తరలించుకోవచ్చు. అయితే అక్రమార్కులు ఎటువంటి అనుమతి తీసుకోకుండా ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మట్టిని అమ్మేసుకుంటున్నారు.

**నిలిచిపోతున్న వాహనాలు**

దేవుడిమాన్యం, ఇతర పొలాల్లో మెరకతీసిన మట్టిని కరప మీదుగా ఇతర గ్రామాలకు, ఇటుక బట్టీలకు, అనధికార లే–అవుట్లకు ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రోజూ కరప మీదుగా 60, 80 ట్రాక్టర్లు తిరుగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మట్టి ట్రాక్టర్లు 5 నిమిషాలకొకటి చొప్పున, తిరగాడుతుండటంతో పేపకాయలపాలెం రోడ్డుపై ప్రయాణం నరకయాతనగా మారిందని ద్విచక్ర వాహనచోదకులు అంటున్నారు. కరప మార్కెట్ సెంటర్ నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటుంది. పేపకాయలపాలెం వెళ్లే రోడ్డులో ఆటోలు నిలుపుతుంటారు. రోజువారీ ట్రాఫిక్‌కు తోడు మట్టి ట్రాక్టర్లు భయంకరంగా తిరుగుతుండటంతో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. జగనన్న కాలనీలు రెండింటికీ వెళ్లేందుకు వేసిన గ్రావెల్ రోడ్డు మట్టి ట్రాక్టర్లు అదుపు లేకుండా తిరుగుతుండటంతో ధ్వంసమవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి మట్టి ట్రాక్టర్లు తిరగకుండా అదుపుచేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా మట్టి తవ్వకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. సిబ్బందిని పంపించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.


జగనన్న కాలనీలకు వెళ్లే రోడ్డులో మట్టి ట్రాక్టర్ సంచారం


మట్టి ట్రాక్టర్లు తిరుగుతుండటంతో ధ్వంసమైన జగనన్న కాలనీలకు వెళ్లే గ్రావెల్ రోడ్డు

# కళా రంగానికి అద్వితీయ సేవలు


మైలురాయి నాటికలో ఓ సన్నివేశం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ 25 ఏళ్లుగా రంగస్థల కళా రంగానికి అద్వితీయ సేవలు అందిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు గురువారం రాత్రి స్థానిక సూర్య కళా మందిరంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. కళా పరిషత్ అధ్యక్షుడు కర్రి అచ్యుత రామారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త మట్టే సత్యప్రసాద్, మాజీ మంత్రి చిక్కల రామచంద్రరావు, క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు అడ్డూరి రామకృష్ణ, కాకినాడ సీపోర్టు లిమిటెట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మెల్ల మురళీధర్ పాల్గొని మాట్లాడారు. సీతారామరాజు కళా పరిషత్ సేవలను కొనియాడారు. ఎందరో నటీనటులు, సాంకేతిక నిపుణులకు పుట్టినిల్లుగా సంస్థ ఉందన్నారు. అనంతరం పలువురిని సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. తొలిరోజు నాటిక పోటీల్లో భాగంగా విజయవాడ వారి 27వ మైలురాయి నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు, సభ్యుడు మార్నీ జానకిరామచౌదరి పాల్గొన్నారు.

# దేవతా దర్శిని యాత్రకు బస్సులు



ఆషాఢ దేవతా దర్శిని యాత్రకు వెళుతున్న భక్తులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆషాఢమాసం సందర్భంగా ఆషాఢ దేవతా దర్శిని పేరుతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కాకినాడ డిపో మేనేజర్ భాస్కరరావు తెలిపారు. స్థానిక డిపో నుంచి గురువారం ఆషాఢ దేవతా దర్శిని ప్రత్యేక సర్వీసును ఆయన ప్రారంభించారు. ఈ బస్సు పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ, చిన్న తిరుపతి శృంగార వల్లభస్వామి, తాటిపర్తి అపర్ణాదేవి, పి. మల్లవరం సుబ్రహ్మణేశ్వరస్వామి, పిఠాపురం పురుహూతిక అమ్మవారు, మట్లపాలెం మహాలక్ష్మి అమ్మవారి దర్శనంతో ముగుస్తుందన్నారు. ఈ యాత్రకు వెళ్లాలనుకునే వారు 73829 10869 నంబర్‌లో సంప్రదించాలని వివరించారు.

# ప్రజా సమస్యలపై పోరాటం ఆగదు

- రైతన్నలను మోసగించిన ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటం చేస్తామని వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. పిఠాపురంలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు రావుల మాధవరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె ప్రసంగిస్తూ రైతులను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. రెండేళ్లుగా అన్నదాత సుఖీభవ సాయం అందించలేదన్నారు. చివరకు కేంద్రం ఇచ్చే వాటా కూడా ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచిందని అన్నారు. తమ పార్టీ తరఫున పోరాటం చేస్తే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. కొన్న ధాన్యానికి ఇప్పటికీ చాలామంది రైతులకు డబ్బులు వేయకుండా ఇబ్బంది పెడుతుందన్నారు. పిఠాపురం పట్టణంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు నీతి నిజాయితీకి నిలబడి ఉన్నారన్నారు. మున్సిపాలిటీలో దళిత వాడల అభివృద్ధిని ప్రభుత్వం కక్ష కట్టి అడ్డుకుంటుందన్నారు. స్థానిక సంస్థల నిధులతో ఆమోదించిన పనులను ప్రభుత్వం అడ్డుకోవడం చాలా దారుణమన్నారు. రాబోయే రోజుల్లో తీవ్ర ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని, నాయకులకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలు అవుతున్నా ఇప్పటికి మేనిఫెస్టోలో ఇచ్చిన పథకాలను అమలు చేయలేదన్నారు. పోరాటం చేయగా తల్లికి వందనం మాత్రం ఇచ్చారని, అది కూడా చాలామంది అర్హులకు కోత పెట్టారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకూ ఇవ్వక పోవడంతో ఖరీఫ్ పెట్టుబడులకు రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులందరికీ పథకాలు అందజేశారన్నారు. ముఖ్యంగా మహిళలను అన్ని విధాలా ఆదుకుని వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అలాంటి పథకాలన్నింటినీ కూటమి ప్రభుత్వం నిలుదల చేసిందన్నారు. ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ గళం విప్పి పోరాటం చేస్తుందన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా, ఎంత భయపెట్టినా, కేసులు పెట్టినా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉంటూ ప్రజల తరఫున పోరాటం చేయడం చాలా గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నేతలు వర్ధినీడి సుజాత, గండేపల్లి బాబి, తలిశెట్టి వెంకటేశ్వరరావు, ఉలవల భూషణం, పచ్చిమల్ల జ్యోతి, పెదపాటి రాజేష్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కొత్తం దత్తుడు, వీఎస్ రెడ్డి, వజ్రపు వీరేష్, మొగలి అయ్యారావు, సోమరౌతు లలిత, సయ్యద్ మొహిద్దీన్, బత్తుల సాయిరాం, బొజ్జా రామయ్య, చెల్లూరి లోవరాజు, కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వంగా గీతా విశ్వనాథ్

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులో పెద్ద ఏలేరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన చీమల ప్రసాద్ (23) హుస్సేన్‌పురం నుంచి పిఠాపురం వెళ్తుండగా వెనుక నుంచి వాహనం ఢీకొంది. దాంతో తీవ్రంగా గాయపడటంతో స్థానికులు అతన్ని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ప్రసాద్‌కు 20 రోజుల క్రితమే వివాహమైనట్లు గ్రామస్తులు తెలిపారు.

### 23న లక్ష పసుపు కొమ్ముల నోము

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23న లక్ష పసుపు కొమ్ముల నోము జరుగుతుందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. గురువారం ఆయన ఆలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారిని శాకంబరిగా అలంకరిస్తామన్నారు. 23న స్థానిక స్టేషన్ సెంటర్‌లో నూకాలమ్మ ఆలయం నుంచి పంచారామ క్షేత్రంలో అమ్మవారికి చీర, గాజులు, సారెతో ఊరేగింపు ఉంటుందన్నారు. ముత్తయిదువులు తీసుకువచ్చే పసుపు కొమ్ములతో ఆలయంలో నోము జరుగుతుందన్నారు.